లేదు. నువ్వేమో వేషానికి పనికొస్తావు. నాదగ్గిర దాపరికాల్లేవు. కాని ఆవేషం అంతకంటె చెయ్యదు. అప్పటి కదీ ఎక్కువే. సమ్మతమైతే వెంటనే లాడ్జికి వచ్చెయ్యి. నువ్వెట్లా చేస్తావో ఎరగనుగదా. నువు బాగా చెయ్యగలవాడి వనితోస్తే నా నెక్స్టు పిక్చర్లో మహరాజుగా హీరోవేషమే ఇస్తా...... నీ పే రేమిటన్నావూ?"

"బి. ఎస్. శాస్త్రులండి!"

"నే నన్నట్టొప్పుకున్నట్టేనా?"

"మీ దయ!"

"ఒరే, సత్తెం. ఈపూటో, రేపొద్దునో శాస్త్రి గారు లాడ్జికి వచ్చేస్తారు. ఆయనవిషయం ఏమిటో చూసి—"

"చిత్తం," అని ప్రొడక్షను మేనేజరు ఎవరి చాటునుండో అని ఏదో పనిమీద వెళ్లిపోయినాడు.

[సశేషము]

---

# ఆంధ్రదేశమున జైనమతవ్యాప్తి

= శ్రీ భావరాజు వేంకటకృష్ణరావు =

ఒకప్పుడు ఆంధ్రదేశమున జైనధర్మము అద్వితీయముగ వర్ధిల్లి జనాదరణ బొందియుండెను. ఆ వృత్తాంత మంతయు తెలిసినపుడు మన కత్యంతాశ్చర్యము కలుగకమానదు. ఆవృత్తాంతము నంతయు కాలవశమున నే డందరును మఱచియున్నారు. జైనవిశిష్యమునుబట్టి యోజించినపుడును, ప్రాచీనశిలా, తామ్ర లేఖనములనుబట్టి పరికించినపుడును జినధర్మ మంధ్రభూమిని క్రీ. పూ. నాలుగవ శతాబ్దము మొదలుకొని క్రీ. త. పంద్రెండవ శతాబ్దాంతమువఱకు — ఇంచుమించుగా పదునారుశతాబ్దములు వర్ధిల్లినట్లు కన్పట్టును. పదమూడవ శతాబ్దాదిగ జైనము పూర్తిగ దేశమందంత రించిపోయెను. ఇంతకాలము అవిచ్ఛిన్నముగ వర్ధిల్లి వ్యాపించినను, జినధర్మవ్యాప్తియొక్క యితిహాసము తెలియకుండుట ఆశ్చర్యమే. ఇంతవఱకు జినధర్మ వ్యాప్తినిగూర్చి సమగ్రముగా వ్రాసిన ఐతిహాసికులు గూడ నెవ్వరు లేరు. ఆంధ్రదేశచరిత్రయందు జైనమత వ్యాప్తియొక్క వృత్తాంతమునకు గల ప్రాముఖ్యమును గుర్తించినవారుగూడ లేకపోయిరి. కొన్ని యేండ్ల క్రిందట డాక్టరు బుర్రా శేషగిరిరావుపంతులుగారు మాత్రము ఈవిషయమునకు గల ప్రాశస్త్యమును గుర్తించి కొంత కృషిచేసి యొక చిన్నగ్రంథము నాంగ్లభాషయందు వ్రాసియుండిరి. ఆగ్రంథ మసమగ్రమయినది. అంతకంటె నెక్కువ పనిచేసి చూపుటకు వారి కాకాలమున అవకాశములు లేకపోయినవి. ఇప్పటికిని ఆంధ్రభూమిని జైనమతవ్యాప్తినిగూర్చి వ్రాయబూనుకొన్నవారికి, ఇతరపరికరములతోపాటు జైనధర్మముయొక్క ప్రధానసిద్ధాంతముల వివరణము, జైనాగమములుగూడ తెలిసియుండవలెను. అన్నిటికంటె ప్రధానముగ జైనుల ధర్మభాషయైన అర్ధమాగధియందు పాండిత్య ముండవలయును. అది అష్టవిధ ప్రాకృతభాషలలో నొకటి. బౌద్ధులకు పాలీ యనబడు మాగధిప్రాకృత మెట్లో, జైనులకు అర్ధమాగధి యట్లు. జైనుల ధర్మగ్రంథము లన్నియు అర్ధమాగధియందు రచింపబడియున్నవి. అర్ధమాగధిని నేర్చు